క్లుప్తంగా

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ



నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ డీఎస్పీ సుదర్శన్‌రావు

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక శ్రీరామ నగర్‌లో ఉన్న హోలి ట్రినిటీ చర్చి ఆధ్వర్యంలో రిటైర్డు డీఎస్పీ గుడిపల్లి సుదర్శన్‌రావు, పాస్టర్ డీఏ. శామ్యూల్ పీటర్ శనివారం రాత్రి రోడ్డు సైడ్ నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం మాజీ డీఎస్పీ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ, యేసుక్రీస్తు జన్మదినం పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నిరుపేదలకు తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె 12వ రోజుకు చేరుకుంది. శనివారం శ్రీకృష్ణదేవ రాయ సర్కిల్‌లో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.ము నెప్ప, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.నిర్మల మాట్లాడుతూ..అంగన్‌వాడీలకు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రూ.26వేల జీతం ఇవ్వాలన్నారు. అంగన్ వాడీలకు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మద్దతు ప్రకటించారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. శనివారంశ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, రంగన్న, నాయకులు నాగరత్నమ్మ, నీలిమ, భాస్కర్ దీక్షలో పాల్గొని తమ డిమాండ్ల కోసం నిరసనలో పాల్గొన్నారు. ఈ సమ్మెకు ఐలు సంఘం జిల్లా నాయకులు మురళీ మోహన్, ఓంకార్, రవికుమార్, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ నిర్మలమ్మ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తిమ్మన్న మద్దతు తెలిపారు.

క్లస్టర్ యూనివర్సిటీ జట్టుకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



క్రీడాకారులకు స్పోర్ట్స్ యూనిఫాం పంపిణీ చేసిన వీసీ సాయిగోపాల్

కర్నూలు (టౌన్) : ఈనెల 25 నుంచి 30 వ తేదీ వరకు చెన్నైకు చెందిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటాలని క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డి.వి.ఆర్. సాయిగోపాల్ అన్నారు. శనివారం స్థానిక క్లస్టర్ వర్సిటీ ప్రాంగణంలో వర్సిటీ జట్టు క్రీడాకారులకు స్పోర్ట్స్ యూనిఫామ్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, టీమ్ మేనేజర్ ఫణినిఖిల్ హర్ష పాల్గొన్నారు.

డ్యాన్స్ మాస్టర్‌కు నృత్య సేవా తపస్వి అవార్డు



డ్యాన్స్ మాస్టర్ కరీముల్లాకు అవార్డు ప్రదానం చేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్ : శాస్త్రీయ నృత్య శిక్షకులు కరీముల్లా జాతీయ స్థాయి నరసింహారావు స్మారక నృత్య సేవా తపస్వి అవార్డును అందుకున్నారు. ఏలూరులో ఈనెల 22వ తేదీ నుంచి జరుగుతున్న అభినయ నృత్య భారతి 28వ వార్షికోత్సవం సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి నృత్య రంగంలో విశిష్ట సేవలు చేస్తున్న 12 మందికి పురస్కారాలకు ఎంపిక చేసి శనివారం ప్రదానం చేశారు. ఇందులో కర్నూలుకు చెందిన కరీముల్లాకు వైఎంహెచ్ఏ హాల్ కార్యనిర్వాహక అధికారి, ప్రపంచ ప్రఖ్యాత కూచిపూడి నృత్య కారులు కేవీ సత్యనారాయణ, లయన్ గట్టెం మాణిక్యాలరావు, వ్యవస్థాపక కార్యదర్శి లయన్ డి.హేమసుందర్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు పాల్గొన్నారు.

బిల్లుల వసూలులో లక్ష్యం చేరాలి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి అన్నారు. శనివారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలవారి బిల్లులు 100 శాతం రాబట్టాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.

వలంటీర్లకు అవగాహన

కర్నూలు (లీగల్) : ప్రాథమిక చట్టాలైనా అరెస్టు, బెయిల్, ప్రాథమిక హక్కులు, ఫ్రీ లీగల్ ఎయిడ్, లీగల్ సర్వీస్ అథారిటీ చట్టం, అసంఘటిత కార్మిక చట్టం, నల్సా నిబంధనల గురించి శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో పారా లీగల్ వలంటీర్లకు అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్‌వీఎన్ శ్రీనివాసరావు, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకటహరినాథ్ పారా లీగల్ వలంటీర్లకు చట్టాల గురించి వివరించారు.







సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఉత్తర ద్వారం, వెంకటరమణ కాలనీలో ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు, ఉత్తర ద్వారం గుండా దర్శించుకుంటున్న భక్తులు

మము బ్రోవుమా.. భక్తవత్సలా!

- నగరంలో వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు
- ఉత్తర ద్వార దర్శనంతో పులకించిన భక్తులు
- తెల్లవారు జాము నుంచే కిటకిటలాడిన వైష్ణవ ఆలయాలు



ఇస్కాన్‌లో జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు పూజలు



విజ్ఞానమందిరంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: వైష్ణవాలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. శనివారం తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ధనుర్మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని వైష్ణవాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం గుండా భక్తులు వెళ్లి మహా విష్ణువును దర్శించుకుని తరించారు. ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వారం ద్వారా శ్రీహరిని దర్శించుకుంటే పుణ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం. దీంతో పెద్ద సంఖ్యలో భక్తులు వైష్ణవాలయాలకు తరలివచ్చి గోవింద నామ స్మరణ చేశారు. కర్నూలు నగరంలో ఆలయాల కమిటీలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇస్కాన్ జగన్నాథ మందిరం, కర్నూలు కృష్ణానగర్ శ్రీనివాస మందిర్, వెంకటరమణ కాలనీ చిన్మయ మిషన్, వెంకటరమణ కాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయం, బీక్యాంప్ విజ్ఞాన మందిరం, దేవనగర్ సత్యనారాయణ స్వామి ఆలయం, సంకల్‌బాగ్ హరిహరక్షేత్రం, వాసవీ నగర్, దండెగేరి వెంకటేశ్వర స్వామి ఆలయాలు, మాసమసీదు గోదాగోకులం, జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠం, మాధవీ నగర్ సీతారామాలయం, గణేష్ నగర్‌లోని సీతా రామాంజనేయ వెంకటేశ్వర స్వామి ఆలయం, శ్రీనివాసనగర్ సత్యసాయి మందిరం, సూర్యనారాయణ స్వామి ఆలయం, మారుతీ నగర్‌లోని సీతారామ స్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారాలను ఏర్పాటు చేసి స్వామివారి దర్శనం కల్పించారు. స్వామివారికి తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజలు, హోమాలు, అర్చనలు, అష్టోత్తర పారాయణం, కల్యాణోత్సవాలు, లక్ష కుంకుమార్చనలు, ప్రవచనాలు, ప్రసంగాలు నిర్వహించారు. ఇస్కాన్‌లో రఘునందన సేవక్ ప్రభు, లలితా పీఠంలో మేడా సుబ్రహ్మణ్యం స్వామి సందేశమిచ్చారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి సంకల్ బాగ్‌లోని హరి హర క్షేత్రంలో ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం ద్వార స్వామిని దర్శించుకున్నారు.



భక్తులకు స్వామి నామాలు దిద్దుతున్న దృశ్యం



కృష్ణానగర్ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద..



బీ క్యాంప్ విజ్ఞాన మందిరంలో..

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి



కేక్ కట్ చేస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, రాష్ట్ర వ్యవసాయ మండలి సభ్యుడు బెల్లం మహేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం కర్నూలు మండలంలోని రుద్రవరం గ్రామంలో నిర్వహించిన జాతీయ రైతు దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి రైతు సోదరులకు తినిపించారు. గత ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల శ్రేయస్సుకు విశేషంగా కృషి చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలువాలని రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతుభరోసా కేంద్రం ఇన్‌చార్జ్‌తో పాటు గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు సన్మానం...

కర్నూలు శివారులోని పసుపల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. పరదీప్ ఫాస్ఫేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయంలో రాణిస్తున్న ఐదుగురు రైతులను సత్కరించి గౌరవించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ మురళీధర్‌చౌదరి, పరదీప్ ఫాస్ఫేటు లిమిటెడ్ శరణ్‌బస్సు పాల్గొన్నారు.

కోల్స్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్



దైవసందేశమిస్తున్న డాక్టర్ ఎం.ఆంద్రూస్

కర్నూలు (టౌన్) : నగరంలోని కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో శనివారం రాత్రి సండేస్కూల్ క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎం.ఆంద్రూస్ జేసుదాస్ హాజరై దైవసందేశం ఇచ్చారు. సండేస్కూల్ క్వయర్ బృందం ఆధ్వర్యంలో క్రిస్మస్ నాటిక, కొరియోగ్రఫీ, క్రీస్తు జననం గురించిన దైవభక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సండే స్కూల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.దేవమనోహర్‌రాజు, ఎస్టీబీసీ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్.మనోరమ ఆల్బర్ట్, సంఘ కాపరులు రెవరెండ్ ఆర్.అనిల్‌కుమార్ సామ్యేల్, రెవరెండ్ ఎస్.జె.జీవన్‌రావు, రెవరెండ్ ఆర్.పాస్కల్ ప్రకాష్ పాల్గొన్నారు. ప్రత్యేక పాటలు, క్రిస్మస్ నాటిక, క్వయర్ బృందంలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి 'వి విష్‌యూ మెర్రీ క్రిస్మస్' అంటూ గీతాలను ఆలపించారు.

లోకరక్షకుడు ఏసు

కర్నూలు(సెంట్రల్): ఏసు క్రీస్తు లోక రక్షకుడు అని పాపాల నుంచి ప్రజలను విముక్తి చేయడానికే ఆయన జన్మించారని డీసీసీ అధ్యక్షుడు కె.బాబు రావు అన్నారు. ఈ ప్రపంచానికి క్రీస్తు ప్రేమ తత్వమే దేవోపదేశము..మానవత్వ సారాంశమని చెప్పారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముందుగా కేకు కట్ చేసి అనంతరం క్యాండిల్ లైటింగ్ సర్వీసు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, నాయకులు దామోదరం రాధాకృష్ణ, బతుకన్న,లాజరస్, ప్రమీళ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అర్లయ్య

కర్నూలు(సెంట్రల్) : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అర్లయ్య డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని రెవెన్యూ భవన్‌లో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థ ఏర్పడి నాలుగేళ్లు గడిచినా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లను ఇవ్వాలన్నారు.

జి.పుల్లారెడ్డి కాలేజీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న జి.పుల్లారెడ్డి కాలేజీ పూర్వ విద్యార్థులు

కర్నూలు సిటీ: జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం 1994–98 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు కలుసుకున్నారు. ఈ సమ్మేళనంలో ఆ కాలేజీ ఈసీఎస్ విభాగం డీప్ మైండ్స్ ఇన్నోవేషన్ ల్యాబ్‌ను 1987–91 తొలి బ్యాచ్‌కి చెందిన శ్రీశ్రీనివాస్, అడిక్కి శ్రీసుధాకర్ మోక్షగుండం, శ్రీనరిహరిశాస్త్రి సహకారంతో ప్రారంభించారు. ఈ ల్యాబ్‌కు సుమారుగా ఐదు వేల డాలర్లు అందజేశారు. అనంతరం 1994–98 పూర్వ విద్యార్థులు సమావేశమై నాటి తీపి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.బి శ్రీనివాసరెడ్డి, డీన్ ఆఫ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డా.బి. వీరభద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కురువ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

కర్నూలు(అర్బన్):జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను నగర శివారుల్లోని ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో ఉన్న బీర లింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో ఆవిష్కరించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కిష్టన్న, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి, మాజీ అధ్యక్షుడు గద్దం రామక్రిష్ణ, అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, అమీలియో హాస్పిటల్ అధినేత డా.ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఐదు లక్షల జనాభా ఉన్న కురువలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా ఎదగాలన్నారు. ఈ నెల 24వ తేదిన ఆలూరులో జరగనున్న కురువ మహా సింహగర్జనకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీలీల, అనిత, నాయకులు పంచలింగాల నాగరాజు, బీ వెంకటేశ్వర్లు, దేవేంద్ర, పాల సుంకన్న, ధనుంజయ, రామక్రిష్ణ, తవుడు శ్రీనివాసులు, తిరుపాలు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జి.పుల్లయ్య, రవీంద్ర కాలేజీ అధ్యాపకులకు డాక్టరేట్లు



బి.సునీత



ఎం.జయలక్ష్మి



డా.టి. సుమన్



డా.పి. సుమన్ ప్రకాష్



బి.రవి చంద్ర

కర్నూలు సిటీ: జి.పుల్లయ్య, రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కాలేజీలకు చెందిన అధ్యాపకులకు వివిధ యూనివర్సిటీలు డాక్టరేట్లు అందజేశాయి. ఈ నేపథ్యంలో వారిని రవీంద్ర విద్యా సంస్థల చైర్మెన్ జి.వి.ఎం మోహన్‌కుమార్, ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్ డా.సి శ్రీనివాసరావు, డా.కె.ఇ. శ్రీనివాసమూర్తి శనివారం ప్రత్యేకంగా అభినందించారు. జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ హ్యూమానిటీస్ విభాగాధిపతి బి.సునీత నానో మెటీరియల్స్‌పై చేసిన పరిశోధనలకు రాయలసీమ యూనివర్సిటీ భౌతిక శాస్త్రం విభాగంలో డాక్టరేట్ అందజేసింది. ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై అధ్యాపకుడు బి.రవిచంద్ర చేసిన పరిశోధనకు ఎల్పీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. అదే విభాగంలో టి.సుమన్ సిగ్నల్ ప్రాసెసింగ్‌పై జరిపిన పరిశోధనలకు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధిపతి పి.సుమన్ ప్రకాష్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో చేసిన పరిశోధనలకు అనంతపురం జేఎన్‌టీయూ డాక్టరేట్లు అందజేసింది. రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కాలేజీ ఎలక్ట్రానిక్స్ విభాగం అధ్యాపకురాలు ఎం.జయలక్ష్మి ఇమేజ్ ప్రాసెసింగ్‌పై చేసిన పరిశోధనకు జేఎన్‌టీయూ అనంతపురం పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది.

ఆటో కార్మికులకు ఈ-శ్రమ్ కార్డు నమోదు

కర్నూలు (లీగల్) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శనివారం ఆ సంస్థ కార్యదర్శి సీహెచ్‌వీఎన్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కార్మిక శాఖ సహాయ సంచాలకులు సాంబ శివుడు, లేబర్ ఆఫీసర్ శ్రీలక్ష్మీ, సిబ్బంది నగరంలోని ఆటో కార్మికులకు ఈ–శ్రమ్ పీఎం ఎస్‌వైఎం కార్డును నమోదు చేశారు. రెండు కేంద్రాలను న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలోనే ఏర్పాటు చేసి ఆటో కార్మికులకు కార్డులు జారీ చేశారు.

పటాలం సేవలు మరువలేనివి

- పోలీస్ క్రీడల ముగింపు సభలో డీఐజీ వెంకటేశ్వర్లు



బెటాలియన్ సిబ్బందితో గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ, కమాండెంట్, ఇతర అధికారులు

కర్నూలు : ప్రకృతి కన్నెర్ర చేసి జిల్లాను వరదలతో ముంచెత్తినప్పుడు పటాలంలో బేస్‌ను ఏర్పాటు చేసి సిబ్బంది అందించిన సేవలు ఎన్నటికీ మరువలేనివని ఏపీఎస్పీ బెటాలియన్స్ మూడవ రేంజ్ డీఐజీ వెంకటేశ్వర్లు అన్నారు. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 2023 ముగింపు సందర్భంగా శనివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమానికి డీఐజీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అస్సాం, నాగాల్యాండ్ ప్రాంతాల్లో ఉగ్రవాదాన్ని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రవాదాన్ని, హైదరాబాదులో మత ఘర్షణను అణచివేయడంలో ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలం కీలక పాత్ర పోషించిందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కూడా ఎలక్షన్ బందోబస్తు విధులను విజయవంతంగా నిర్వహించిన చరిత్ర కర్నూలు రెండో బెటాలియన్‌కు ఉందని గుర్తు చేశారు. అయితే, పటాలం సిబ్బంది నెలల తరబడి కుటుంబాలకు దూరంగా ఉంటూ విధులు నిర్వర్తించడం వల్ల కలిగే మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ప్రతి ఏటా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదరన్ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్, రెండవ పటాలం కమాండెంట్ రవిశంకర్, ఆయన సతీమణి వినుతా రెడ్డి, ఇన్‌చార్జ్ అదనపు కమాండెంట్ రవికిరణ్, అదనపు సహాయ కమాండెంట్ ఎస్ఎం బాషా, డీఎస్పీ భక్తవత్సలంతో పాటు రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ క్రీడల్లో విజయం సాధించిన విజేతలకు డీఐజీ వెంకటేశ్వర్లు, కమాండెంట్ రవిశంకర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

ఓవరాల్ చాంపియన్ 'డి' కంపెనీ

కర్నూలు ఏపీఎస్పీ పటాలంలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రీడాపోటీల్లో 'డి' కంపెనీ (ఎస్‌డీఆర్‌ఎఫ్) ఓవరాల్ చాంపియన్‌తో పాటు అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ను దక్కించుకుంది. శనివారం సాయంత్రం నిర్వహించిన ముగింపు వేడుకల్లో బెటాలియన్స్ డీఐజీ వెంకటేశ్వర్లు, కమాండెంట్ రవిశంకర్, హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే గేమ్స్ చాంపియన్‌షిప్‌ను ఇ అండ్ హెడ్ క్వాటర్స్ కంపెనీ కైవసం చేసుకోగా అథ్లెటిక్స్ వ్యక్తిగత చాంపియన్‌గా కానిస్టేబుల్ ఎన్.రవీంద్ర (పీసీ 421) నిలిచాడు.

జీవిత మార్గదర్శి భగవద్గీత



భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: విద్యా ప్రకాశానంద గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో భగవద్గీత సహస్ర గళ పారాయణం చేశారు. గీతా జయంతిని పురస్కరించుకొని శనివారం సంకల్ బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి శ్రీనివాస మంగాపురం శ్రీ వశిష్ఠాశమ లలితా పీఠం సంస్థాపక పీఠాధిపతి పూజ్యశ్రీ స్వరూపానందగిరి స్వామి, విజయవాడ శ్రీమద్ అష్టాక్షరి పీఠం పీఠాధిపతి శ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్‌స్వామి, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి అనుగ్రహ భాషణం చేశారు. స్వరూపానందగిరి స్వామి మాట్లాడుతూ జీవిత మార్గదర్శి భగవద్గీత అన్నారు. భగవద్గీత పఠనం, శ్రవణంతో ఆలోచనా ధోరణిలో మార్పు సంభవిస్తుందన్నారు. సంఘం అధ్యక్షుడు డి.వి. రమణ మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం సాయంత్రం ధ్యానం, భగవద్గీతపై స్వరూపానంద గిరి స్వామి ఉపన్యసిస్తాన్నారు. మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష పాల్గొని స్వామీజీలను సన్మానించారు. కార్యక్రమంలో తితిదే ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, గీతా ప్రచార సంఘం కార్యదర్శులు జగన్నాథ గుప్త, అనంత అనిల్ కుమార్, సింహాద్రి రమేష్, మారం అనిల్, సత్యసాయి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు మాకా అశోక్‌కుమార్, సాయిబాబ భక్త మండలి కార్యదర్శి మహాబలేస్, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు 108 కోట్ల శ్రీరామనామ లిఖిత పుస్తకాలు



వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: ఆవోపా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 108 కోట్ల శ్రీరామనామ లిఖిత పుస్తకాలను శనివారం అయోధ్యకు పంపారు. స్థానిక గోశాలలో ఆ పుస్తకాల తరలింపు వాహనానికి టీడీపీ ఇన్‌చార్జ్ టీజీ భరత్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆవోపా చీఫ్ కన్వీనర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ జనవరి 22వ తేదీన అయోధ్య రామ మందిరం ప్రారంభానికి సంఘీభావంగా ఆవోపా ఏప్రిల్ నెలలో ప్రతిష్ఠాత్మకంగా శ్రీరామ నామ లిఖిత యజ్ఞాన్ని చేపట్టిందన్నారు. మొదటి విడతలో ఇప్పటి వరకు అందిన 6,732 పుస్తకాలను 102 బాక్స్‌లలో అయోధ్యకు పంపామన్నారు. ఇందులో 10 వేల మంది పాల్గొన్నారన్నారు. రెండో విడత ఫిబ్రవరిలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త శివరాజ్, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం, వీహెచ్‌పీ జిల్ల అధ్యక్షులు గోరంట్ల రమణ, ఆవోపా అధ్యక్షులు మేడా సురేష్ , కార్యదర్శి జవహర్‌బాబు పాల్గొన్నారు.

పీవీ నరసింహారావుకు నివాళి

కర్నూలు(సెంట్రల్) : మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు 19 వర్ధంతిని పురస్కరించుకుని శనివారం కాంగ్రెస్ పార్టీ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించింది. పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నాయకులు దామోదరం రాధాకృష్ణమూర్తి, బతుకన్న, లాజరస్, ప్రమీళ, వెంకటన్న, వెంకటసుజాత పాల్గొన్నారు.

13వ రోజు న్యాయవాదుల దీక్షలు

కర్నూలు(లీగల్) :ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కు చట్టం–2022, జీవో నెంబర్ 512ను వెంటనే రద్దు చేయాలని కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారంతో 13వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదులు బాబు సాహెబ్, మహావిష్ణు, తిరుపతయ్య కూర్చున్నారు.

నేడు సుందరయ్య భవన్‌లో ఉచిత వైద్య శిబిరం

కర్నూలు(సెంట్రల్): సుందరయ్య స్ఫూర్తి కేంద్ర ప్రజారోగ్య వేదిక, ఏపీ మెడికల్ అండ్ సేల్స్ యూ నియన్ల ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన సుందరయ్యభవన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్న ట్లు ఆ కేంద్రం చైర్మన్ కె.ప్రభాకరరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి11 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు.